క్లుప్తంగా

ఆరోగ్య తనిఖీలు



రోగులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎల్.ప్రదీప్, మరికొంతమంది సిబ్బంది కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్యం శిబిరం ఏర్పాటు చేసి, గ్రామస్తులకు వైద్యసేవలు అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఏఎన్‌ఎం సూర్యప్రభ, తదితరులు పాల్గొన్నారు.

చోడిసాగుపై అవగాహన



చోడి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రేగిడి: మండలంలోని పోరాం, కాగితాపల్లి, ఉనుకూరు, సరసనాపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద చోడిసాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో ఎక్కువగా సాగు చేస్తే ఈ పంటతో అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఈ సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆదివారం అరెస్ట్ చేశామని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు 100కు అందించిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి, దాడి చేసి పట్టుకున్నామన్నారు. జూదరుల నుంచి రూ.13,330 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనక మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక రోజు కావడంతో ప్రతీ వారం అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్ నేతృత్వంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

సీతారామలక్ష్మణుల విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామ రామాలయంలో సోమవారం ప్రతిష్ఠించనున్న సీతా,రామ,లక్ష్మణుల విగ్రహాలను ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు మేళ,తాళాలు,కోలాటాల మధ్య ఊరేగించారు. గతంలో ఈ మందిరంలో సీతా,రామ, లక్ష్మణుల చిత్రపటాలు ఉండేవి. వాటి స్థానంలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ ముహూర్తానికే ఇక్కడ సీతా, రామ,లక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. రామాలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

ఘనంగా గ్రామదేవతల తీర్థం

కొత్తవలస: మండలంలోని రాజుపాత్రునిపాలెం గ్రామంలో రావాలమ్మ తల్లి తీర్థం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూలజ్యోతిని, చెక్క గుర్రాలను ప్రత్యే కంగా అలంకరించి మేళతాళాల మధ్య ఊరేగించారు. అమ్మవారికి గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోళాటం, పలురకాల జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

అరిగిపాలెం, ఆతవలో..

వేపాడ: మండలంలోని అరిగిపాలెంలో గ్రామ దేవత చుక్కమాంబ, ఆతవలో వేమాలమ్మ తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు ఆయా గ్రామా ల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం నేపథ్యంలో నిర్వాహకులు పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పక్కాగా కులగణన



రామభద్రపురంలోని కల్లి వీధిలో కులగణన సర్వేలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆదివారం ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేర వివరాలు సేకరించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: ఎం.బూర్జవలసలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్



బాడంగిలో కులగణన సర్వే



రాజాం: పొగిరిలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకరరావు



వంగర: కులగణన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



రేగిడి: వన్నలిలో కులగణన సర్వే చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి గోవిందరావు



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు



రాజాం సిటీ: దోలపేటలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



రేగిడి: ఖండ్యాంలో ఇంటింటికీ అక్షతలు పంచిపెడుతున్న శ్రీరాముని భక్తులు



సంతకవిటి: కృష్ణంవలసలో అయోధ్య రాముని అక్షతలతో గ్రామస్తులు

రేగిడి: అయోధ్య రామమందిరంలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని, మండలంలోని ఖండ్యాం గ్రామంలోని ఇంటింటికీ అక్షతలు ఆదివారం పంపిణీ చేశారు. అక్కడి రాముడికి పూజలు చేసిన అక్షతలనే భక్తుల ఇళ్లకు అందిస్తున్నామని, బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున ఇంట్లో ఈ అక్షతలతో పూజలు చేసుకోవాలని రామభక్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గొలివి జగ్గునాయుడు, బూసి ప్రసాదరావు, తంగి ప్రసాదరావు, బవిరి ప్రసాదరావు, గంగు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస గ్రామంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంద్రేటి కేసరి ఆధ్వర్యంలో అయోధ్య రాముని అక్షతలు ఇంటింటికీ ఆదివారం పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పాలిన అప్పన్న, రామాలయం పూజారి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: జైశ్రీరామ్ నినాదాలు చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: అయోధ్య శ్రీరామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని, స్థానిక పట్టణంలోని వీధుల్లో శ్రీరాముని భక్తులు జైశ్రీరామ్ అని నినాదాలు చేస్తూ ఊరేగారు.

ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

• వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

వంగర: ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ కార్యక్రమానికి ఆదివారం హాజరైన ఆయన అక్కడి యువత, ప్రజలను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో 99.5 శాతం హామీలను నెరవేర్చారన్నారు. అన్ని వర్గాల్లోని ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే ఆయన తపని, అందుకే అందరికీ మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు కనగల పారినాయుడు, బెవర శ్రీనునాయుడు, తదితరులు ఉన్నారు.

ఘనంగా బాలఅన్నమ్మ జాతర మహోత్సవాలు



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



విద్యుత్ అలంకరణతో మెరిసిపోతున్న ఆలయ ప్రాంగణం

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో బాలఅన్నమ్మ పేరంటాలు జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం నుంచి జరుగుతున్న ఈ వేడుకలు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా పలువురు కళాకారులు చేపట్టిన తప్పెటగుళ్లు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శన, శ్రీరామాంజనేయ యుద్ధం నాటకం, నర్తనశాల ఈవెంట్స్ వారి గ్రూపు డ్యాన్స్‌లు చూపరులను అలరించాయి. 45 ఏళ్లుగా ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలను చూసేందుకు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు విజయవాడ, రాయగడ ప్రాంతాల నుంచి కూడా ప్రజలు తరలివస్తుండడం విశేషం. జాతర జరిగినన్ని రోజులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



రవికుమార్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ చక్రవర్తి, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం సిటీ: ఉద్యోగి పనిచేసిన కాలంలో ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తృప్తి రిసార్ట్‌లో రాజాం సీఐగా పనిచేసి బదిలీపై వెళ్లిన కె.రవికుమార్‌కు వీడ్కోలు, బాధ్యతలు చేపట్టిన సీఐ మోహనరావుకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ప్రజల నుంచి మన్ననలు దక్కుతాయన్నారు. ఏడాదిన్నర కాలంలో రాజాం ప్రజలకు రవికుమార్ అందించిన సేవలను ఆయన ప్రశంసించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం బదిలీ సీఐకి అధికారులతో పాటు పట్టణ ప్రముఖులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్, రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, చీపురుపల్లి సీఐ హెచ్.ఉపేంద్ర, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులంతా హాజరవుతారన్నారు.

కోడిపందాల శిబిరాలపై దాడులు

రామభద్రపురం: మండలంలోని కోటశిర్లాం అలుగోలు కళ్లాల వద్ద గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరాలపై పోలీసులు ఆదివారం ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ ఘటనలో ఇద్దరు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు.

ఆధ్యాత్మిక సభ

రేగిడి: స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆధ్యాత్మిక వక్తలు కమిడి సత్యనారాయణనాయుడు, జడ్డు జగ్గారావు, పాలకొండకు చెందిన మరో ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ కలిసి ఆధ్యాత్మిక ప్రసంగం ఇచ్చారు. పుణ్యతీర్థాలు, పుణ్యక్షేత్రాలు సత్సంగానికి సాటి రావన్నారు. ఎక్కడైతే సత్సంగం జరుగుతుందో అక్కడ ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. గురువులు చెప్పిన మాటలను తూ.చ తప్పకుండా ఆచరించి, సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు ఆధ్వర్యంలో దత్త పాదుకాపూజ, గణపతి హోమం, ఆధ్యాత్మిక వక్తలకు సన్మానాలు చేశారు.

కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి

బొబ్బిలి: స్థానిక సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, నియోజకవర్గ కార్యదర్శి బొద్దాన శ్రీనివాసరావు కలిసి, లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

• పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, పద్మావతి

రాజాం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ టౌన్ కార్యాలయంలో రాజాం పట్టణానికి చెందిన రచయిత సూర్యరత్న ఆసపు సూర్యం రాసిన కోలాటం భక్తిగీతాలు–2 పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రాజాం ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతిల చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రాముఖ్యత సంతరించుకున్న కోలాటం ఇప్పుడు అన్ని గ్రామాలకు వ్యాపించిందని, ఈ కోలాటానికి సంబంధించి, భక్తి, జానపద గీతాలను సూర్యం ఎంతో చక్కగా రాశారన్నారు. ఈ పుస్తకంలో శ్రీగణేష, నవదుర్గాదేవి, పోలిపల్లి పైడితల్లి, అయ్యప్పస్వామి, వాసవీ, మెహర్‌బాబాతో పాటు సకల దేవతల భక్తిగీతాలు ఉన్నాయన్నారు. అక్కడికి వచ్చిన వారికి ఉచితంగా ఈ పుస్తకాలు అందజేశారు. అనంతరం పుస్తక రచయిత సూర్యంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ కార్యకర్తలు, కోలాటం కళాకారులు పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావ సభకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: విశాఖ జిల్లాలోని భీమిలిలో ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావ సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా సమాయత్తం కావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన సభకు జనసమీకరణపై నేతలకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఆ సభకు భారీ స్థాయిలో పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూడాలన్నారు. మండలాలు, సచివాలయాల వారీగా సమావేశాలు జరిపి, సభకు వస్తున్న జనం, ఏర్పాట్లపై చర్చించుకోవాలన్నారు. పార్టీ పదవులు అనుభవిస్తున్న వారు, కీలక నేతలంతా తప్పనిసరిగా సభకు రావాలన్నారు. ఇదే సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేస్తారన్నారు. సభకు అధిక సంఖ్యలో జనం తరలివచ్చేలా మండలాలు, సచివాలయాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు బొబ్బిలిలో, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు బాడంగిలో, 23వ తేదీ ఉదయం 11 గంటలకు తెర్లాంలో, 24వ తేదీ ఉదయం 11 గంటలకు బొబ్బిలి పట్టణం, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు రామభద్రపురం మండలంలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు ఆయా ప్రాంతాల ముఖ్య నేతలు, కార్యకర్త లు, అభిమానులంతా హాజరుకావాలన్నారు. ఈ సమావేశాల్లో సభకు సమాయత్తం, జనం తరలింపు, ప్రయాణ, భోజన ఏర్పాట్లపై చర్చించడం జరుగుతుందన్నారు. ఏ ప్రాంతం నుంచి ఎంతమంది వస్తున్నారన్న దానిపై వాహనాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

బాలరాముని శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రాజాం: అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని, స్థానిక పట్టణంలోని పలు వీధుల్లో బాలరాముని శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంచర వీధి శాస్తా సమాజం విశ్వనాథ గురునిలయం రామమందిర భక్తులు రాముని చిత్రపటాలతో రామనామం జపిస్తూ.. భక్తిగీతాలు ఆలపిస్తూ వీధుల్లో తిరిగారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయనున్న సందర్భంగా ఇళ్ల గుమ్మాల వద్ద దీపారాధన నిర్వహించాలని కోరారు.

మార్మోగిన రామనామం..

వంగర: మండలంలోని మద్దివలస గ్రామంలో సీతారాముల చిత్రపటాలను ఆదివారం ఊరేగించారు. ఈ నేపథ్యంలో భక్తులు చేసిన జై శ్రీరామ్ నినాదాలతో రామనామం మార్మోగింది. గ్రామానికి చెందిన శ్రీసీతారామ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన బ్రాహ్మణ కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, సర్పంచ్ ఉత్తరావెల్లి పార్వతి, బెవర శ్రీనివాసరావు, పాలవలస కృష్ణమూర్తి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి తదితరులు పాల్గొన్నారు.

‘ఆసరా’ ఆనందం



రాజాం: గడిముడిదాంలో మహిళా సంఘాల సభ్యులతో వీవోఏలు



రేగిడి: తునివాడలో వైఎస్సార్ ఆసరా పథకం నిధుల జమపై చర్చించుకుని, ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు

రాజాం: మండలంలోని గడిముడిదాం, గురవాం, శ్యాంపురం, అమరాం, దోసరి, ఆగూరు, కంచరాం గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యుల్లో వైఎస్సార్ ఆసరా పథకం ఆనందం కనిపిస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఈ పథకం నగదు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుండడంతో అవి తమకు ఎంతగానో ఉపయోగపడతాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభలు నిర్వహించి మరీ ఏ సంఘానికి ఎంతమేర డబ్బులు వస్తాయి, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలని చర్చించుకుంటున్నారు.

రేగిడి: మండలంలో తునివాడ, చిన్నశిర్లాం, ఖండ్యాం, తాటిపాడు గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులతో సీసీలు, సీఎఫ్‌లు ఆదివారం సమావేశమై, విడుదల కానున్న పథకం నాలుగో విడత నిధులు, వాటి వినియోగంపై చర్చించారు.